సమన్వయంతో జిల్లా అభివృద్ధి

- దిశ కమిటీ చైర్మన్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- జిల్లా అధికారులు, జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీలతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్యే, కలెక్టర్, అదనపు కలెక్టర్

ఆదిబట్ల, నవంబర్ 16 : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి రంగారెడ్డి జిల్లాను అభివృద్ధిపథంలో నడిపిద్దామని దిశ కమిటీ చైర్మన్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీ అధ్యక్షతన వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీలతో దిశ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాకు అన్ని సదుపాయాలు, సౌకర్యాలు, వనరులు ఉన్నందున జిల్లాను అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో ఉంచాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులను మున్సిపాలిటీలు, గ్రామపంచాయల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు లేని పాఠశాలలను గుర్తించి వెంటనే మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను విద్యార్థులు వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. జిల్లాలోని బస్తీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. జిల్లాలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ పరికరాలను ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు.

జిల్లా రాష్ట్ర రాజధానికి సమీపాన ఉన్నందున కూరగాయలకు మంచి డిమాండ్, మార్కెట్ ఉందని.. అందువల్ల ప్రత్యామ్నాయంగా రైతులు కూరగాయలు, పండ్లు పండించేలా రైతు వేదికల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించుకోవాలని., గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని, రక్తహీనతను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమాధికారిని ఆదేశించారు. యువతకు ఉపాధి కల్పించే దిశగా జాబ్ మేళాలను నిర్వహించి ఉద్యోగాలు కల్పించాలని ఉపాధి కల్పనాధికారికి సూచించారు. జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని పరిశ్రమలశాఖ అధికారికి సూచించారు. సమావేశంలో భాగంగా పంచాయతీరాజ్ ఆర్‌అండ్‌బీ, ఉపాధిహామీ, విద్యుత్, మిషన్ భగీరథ, జాతీయ రహదారులు, భూగర్భజలాలు, సీపీవో, గిరిజన సంక్షేమ శాఖ, వివిధ శాఖలకు సంబంధించి తదితర అంశాలపై సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం అందించే నిధులను సద్వినియోగం చేసుకునేలా చూడాలని చైర్మన్ సూచించారు. సమావేశంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్, హెచ్‌ఎండబ్ల్యూడీసీ ఈడీ మయాంక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన వివిధ శాఖల జిల్లా అధికారులు

ఇబ్రహీంపట్నంలో పరీక్షా కేంద్రాల వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ డీసీపీ సత్యనారాయణ

నేటి నుంచి గ్రూప్-3 పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం
- జిల్లావ్యాప్తంగా పరీక్షలకు హాజరు కానున్న 56,394 మంది
- ఇబ్రహీంపట్నంలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ డీసీపీ సత్యనారాయణ

రంగారెడ్డి, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ) : నేటి నుంచి రంగారెడ్డిజిల్లాలో గ్రూప్-3 పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షల నిర్వహణ కోసం జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లావ్యాప్తంగా జరుగనున్న పరీక్షలకు 56,394 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణ కోసం కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ నేతృత్వంలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఆదివారం రెండు పేపర్లు ఉంటాయి. ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 3 నుంచి 5:30 వరకు రెండో పేపర్ ఉంటుంది. అలాగే, 18న సోమవారం ఉదయం పేపర్ 3 ఉంటుంది. అభ్యర్థులను ఉదయం 8:30 నుంచి 9:30 గంటల వరకు పరీక్షా కేంద్రానికి అనుమతిస్తారు. 9:30 తర్వాత గేట్లు మూసివేస్తారు. పోలీసులు, నోడల్ అధికారులు, సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా కింది స్థాయి అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం అడిషనల్ డీసీపీ సత్యనారాయణ ఇబ్రహీంపట్నంలోని సెయింట్ ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు.

షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాల్లో..

షాద్‌నగర్ డివిజన్‌లో 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలకు 2,500 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. షాద్‌నగర్‌లో ఠాగూర్ హైస్కూల్, భాష్యం హైస్కూల్, విజేత జూనియర్ కళాశాల, బ్రిలియంట్ జూనియర్ కళాశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, విశ్వభారతి జూనియర్ కళాశాలలో గ్రూప్-3 పరీక్షలకు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి 24 మందికి ఒక్కో పర్యవేక్షకుడిని నియమించనున్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో 10 సెంటర్లలో 6,724 మంది పరీక్షకు హాజరుకానున్నారు.

ఇబ్రహీంపట్నం డివిజన్‌లో అత్యధికంగా 25 సెంటర్లు

ఇబ్రహీంపట్నం డివిజన్‌లో 25 పరీక్ష కేంద్రాల్లో 15,958 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఇబ్రహీంపట్నంతో పాటు ఆదిబట్ల పరిధిలోని పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. గురునానక్, శ్రీఇందు, సిద్ధార్థ, శ్రీదత్త, సీవీఆర్, ఎంఆర్ఎం, ఏవీఎన్, కేశవ్ మెమోరియల్, భారత్, ఎంవీఎస్ఆర్, విశ్వేశ్వరయ్య ఇంజినీరింగ్ కళాశాలల్లో రెండేసి చొప్పున., హెచ్ఆర్‌డీ, ఆదిబట్లలోని డిల్లీ పబ్లిక్ స్కూల్, బాలాపూర్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

శిలువ వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

జాతరకు హోరెత్తిన భక్తులు

- జాతర ప్రాంగణంలోని శిలువ వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- నేటితో ముగియనున్న మెథడిస్టు క్రిస్టియన్ జాతర

ధారూరు, నవంబర్ 16 : ధారూరు మండల పరిధిలోని ధారూరు స్టేషన్-దోర్నాల్ గ్రామాల మధ్య ఉన్న మెథడిస్టు క్రిస్టియన్ జాతరకు భక్తులు శనివారం పోటెత్తారు. ధారూరు మెథడిస్టు జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు కాలినడకన తరలివస్తున్నారు. మెథడిస్టు జాతర రేపు(ఆదివారం) ముగియనుండడంతో శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. యాత్రికులు జాతర ప్రాంగణంలో రెండు రోజులు ఉండేందుకు గుడారాలను ఏర్పాటు చేసుకున్నారు. ఏస్తుక్రిస్తు శిలువ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రార్థనా మందిరంలో ప్రార్థనలు చేసి బిషప్‌లు దైవ సందేశాన్ని తెలుగు, కన్నడ భాషల్లో వినిపించారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు సందేశాన్ని వింటూ ఏసుప్రభువును తలుచుకున్నారు. భక్తులు శిలువ వద్ద కొవ్వొత్తులను వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జాతరకు వచ్చిన ముఖ్య అతిథులకు బిషప్‌లు, జాతర కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆదివారం మెథడిస్టు జాతర ముగియనున్నందున భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశాలుండడంతో ఎయాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు చేస్తున్నారు.

బాధపడుతున్నా పట్టించుకోరా..?

- జ్వరాలు, చర్మవ్యాధులతో సతమతమవుతున్న విద్యార్థులు
- వైద్యం కోసం ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న వైనం
- స్పందించని అధికారులు

ఆటోలో ప్రభుత్వ దవాఖానకు వెళుతున్న జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులు

మంచాల, నవంబర్ 16 : మంచాల మండలం నోముల గ్రామ సమీపంలో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ వసతి గృహంలోని విద్యార్థులు జ్వరాలు, చర్మవ్యాధులతో విద్యార్థులు బాధపడుతున్నారు. సంబంధిత విద్య, వైద్యశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో విద్యార్థులే ప్రైవేటు ఆటోల్లో మంచాల ప్రభుత్వ దవాఖానకు వచ్చి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. వసతి గృహంలో 10 రోజుల నుంచి తాగునీటి సమస్యతో పాటు జ్వరాలు, చర్మవ్యాధులతో విద్యార్థులు బాధపడుతున్నారు. కొందరిని ఎలుకలు కూడా కరవడంతో వారు కూడా వైద్యం కోసం శనివారం మధ్యాహ్నం ప్రభుత్వ దవాఖానకు చేరుకున్నారు. ప్రభుత్వ వైద్యాధికారి చికిత్స నిర్వహించి వారికి తగిన మందులు ఇప్పించి పంపించారు. ప్రతి నెల వసతి గృహలకు వైద్యాధికారులు వెళ్లి పరీక్షలు చేయాల్సి ఉన్నప్పటికీ అవేమీ పట్టనట్టుగా వ్యవహరించడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిరంతరం ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ అధికారి కూడా అటువైపు వెళ్లకపోవడంతో నిత్యం విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇకనైనా అధికారులు మేల్కొని వసతి గృహంలో ఉన్న సమస్యలతో పాటు జ్వరాలు చర్మ వ్యాధులతో బాధపడుతున్నవారి బాధలను తీర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.

బాధ్యతలు స్వీకరించిన వివిధ కళాశాలల నూతన ప్రిన్సిపాల్స్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలలకు ప్రిన్సిపాల్స్, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ పదవుల్లో కొత్త వారిని నియమించిన నేపథ్యంలో వారు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ కాసిం, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ జి.ప్రభాకర్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఐ.శేఖర్, లా కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాంప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారిని పలువురు అధికారులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు అభినందించారు.

ప్రజారోగ్యం ప్రభుత్వానికి పట్టదా..?

తెలంగాణ రాష్ట్ర మైనారిటీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు వాహబ్

కొడంగల్, నవంబరు 16 : ప్రజారోగ్యాలపై ప్రభుత్వానికి పట్టింపు లేదని తద్వారా సీఎం రేవంత్‌రెడ్డి తన స్వంత నియోజకవర్గంలో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేసి కాలుష్యాన్ని అంటగట్టే ప్రయత్నం చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మైనార్టీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు వాహబ్ తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కొడంగల్ ప్రాంత ప్రజల ఆరోగ్యం, భూమి, పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రజలకు అండగా నిలుస్తున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం ప్రభుత్వ దౌర్జాన్యానికి పరాకాష్టగా పేర్కొన్నారు. ఫార్మా కంపెనీల స్థాపనకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తే అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నట్లు తెలిపారు. ప్రజల గొంతును నొక్కేందుకు ప్రభుత్వం అక్రమ అరెస్టులను చేస్తున్నదని ఆరోపించారు. సీఎం స్వలాభం కోసం కొడంగల్ ప్రజల ప్రాణాలను పణంగా పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఫార్మా కంపెనీలు ఏర్పాటైతే ఈ ప్రాంతం కాలుష్యంతో నిండుకొని, తాగునీటితో పాటు వాతావరణ కాలుష్యం అవుతుందన్నారు. తద్వారా ప్రజారోగ్యాలు దెబ్బతినడంతోపాటు వ్యవసాయ పొలాలు నిర్జీవం కావడం ఖాయంగా పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం దిశగా పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు మౌనం వీడి ప్రజల ఇబ్బందులను గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

శనివారం తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

బీఆర్ఎస్‌కు జై కొట్టి.. గులాబీ కండువా కప్పుకొని..

- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో భారీగా చేరికలు
- గులాబీ కండువా కప్పుకొన్న కాంగ్రెస్ నేతలతో పాటు 350 మంది నేతలు, కార్యకర్తలు
- నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతా: కార్తీక్‌రెడ్డి

మణికొండ, నవంబర్ 16: రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి నేతృత్వంలో శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి మాల్యాద్రి నాయుడు, షేక్ ఆరిఫ్, ఖానాపురం మాజీ ఉపసర్పంచ్ వెంకటేశ్‌యాదవ్‌లతో పాటు 350 మంది నాయకులు, కార్యకర్తలు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్ తారకరామారావు సమక్షంలో గులాబీ కండువా కప్పుకొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ 'రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి అతిపెద్ద మెజార్టీతో రెండుసార్లు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను గెలిపించాం. ఎవరూ సొంత శక్తితో గెలిచిన వారే కాదు.. కేసీఆర్ వంటి శక్తి వెనుకాల ఉండకపోతే కేవలం వార్డు మెంబర్‌గా కూడా వారు గెలకపోతుండే. నియోజకవర్గ ప్రజలకు ఏం చెప్పి పార్టీ మారారో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఇప్పటికీ స్పష్టంగా ప్రజలకు చెప్పలేద'న్నారు. నాలుగేండ్ల అధికారం ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనకు పనికిరాదని ముందే గుర్తించి.. బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు వచ్చిన నాయకులందరికీ భవిష్యత్‌లోనూ సముచితమైన స్థానం, గౌరవాన్ని అందిస్తామని కార్తీక్‌రెడ్డి స్పష్టం చేశారు. పదేండ్లు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను చూస్తుంటే తనకు బాధేస్తున్నదని, వారంతా జెండా కూలీలుగా మారారని, వారిని చూస్తే జాలేస్తున్నదని కార్తీక్‌రెడ్డి అన్నారు. కనీసం కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకోని వారు సైతం నామినేటెడ్ పదవులు తీసుకుంటున్నారని గుర్తుచేశారు.

ఇప్పటికిప్పుడు రాష్ట్రంలో ఎన్నికలు పెడితే కాంగ్రెస్ పార్టీకి ఐదు సీట్లు కూడా సరిగ్గా రావని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగరాజు, కీర్తీలతాగౌడ్, రూపా రెడ్డి, మహేశ్, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీడీఎంఎస్‌లో వివిధ వొకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత 10వ తరగతి అని తెలిపారు. రెస్పిరేటరీ థెరపీ, ఈసీజీ, మెడికల్ ల్యాబ్, కార్డియాలజీ టెక్నీషియన్స్, రేడియోగ్రఫీ అసిస్టెంట్ వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు కోర్సుల్లో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. కోర్సుల్లో చేరేందుకు ఈనెల 30 ఆఖరు అని అన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 83090 37134, 63058 95867 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గిరిజనుల భూములు లాక్కుంటే ఊరుకునేది లేదు

బీఆర్ఎస్ సీనియర్ నేత కేతావత్ రామూనాయక్

శంషాబాద్ రూరల్, నవంబర్ 16 : గిరిజనులపై అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని బీఆర్ఎస్ సీనియర్ నేత కేతావత్ రామూనాయక్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డికి పాలన చేతగాక ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తప్పుదోవ పట్టించడం కోసం తెలంగాణవ్యాప్తంగా భూములు లాక్కోవాలని చూస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతినిత్యం పహిస్తున్న కొడంగల్‌లో అల్లుడి కంపెనీల కోసం అమాయకులైన గిరిజనులకు జీవనాధారమైన భూములను లాక్కునేందుకు చూస్తే ఊరుకునే ప్రసక్తిలేదన్నారు. గిరిజనులపై అమానుషంగా దాడి చేసిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

కమనీయం.. నృత్య విన్యాసం

కొండాపూర్, నవంబర్ 16: వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు నృత్యకారుల కథక్, కూచిపూడి నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో కథక్ నాట్య గురువులు సంజుక్త ఘోష్ శిష్య బృందం బెంగాలీ సంస్కృతి సంప్రదాయాలలో రవీంద్రనాథ్ ఠాగూర్ పాటలకీ నృత్య ప్రదర్శనలిచ్చారు. అనంతరం కూచిపూడి నాట్య గురువులు ఒగ్గు ప్రవీణ్ శిష్య బృందం తాండవనృత్యకారి, జతిస్వరం, రామాయణ శబ్దం, మరకత, మండూక శబ్దం, దశావతార శబ్దం, హిందువుల తిల్లాన అంశాలను నర్తించిన తీరు ఆద్యాంతం ఆకట్టుకుంది.

న్యూరోలో మైక్రో సర్జరీతో మెరుగైన ఫలితాలు

నిమ్స్ న్యూరో సర్జరీ విభాగం అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ వై.తిరుమల్

ఖైరతాబాద్, నవంబర్ 16 : న్యూరో సంబంధిత వ్యాధులకు ఆధునిక చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చాయని నిమ్స్ న్యూరో సర్జరీ విభాగం అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ వై.తిరుమల్ అన్నారు. ది న్యూరోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, నిమ్స్ దవాఖాన సంయుక్తాధ్వర్యంలో 'మైక్రో సర్జరీ, మైక్రో న్యూరోవాస్కులర్ అనస్టొమోసిస్' అనే అంశంపై న్యూరో వైద్యులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, సదస్సు జరిగింది. డాక్టర్ తిరుమల్ మాట్లాడుతూ.. బ్రెయిన్ బైపాస్ సర్జరీలు ఎంతో క్లిష్టమైనవని, స్ట్రోక్ కేసులతోపాటు చిన్నారుల్లో వచ్చే మెదడు సంబంధిత వ్యాధులకు ఆధునిక చికిత్స విధానం ఎంతో దోహదపడుతుందన్నారు. అరుదైన 'మోయమోయ' వ్యాధితో మెదడులో రక్తనాళాలు దెబ్బతిని, గడ్డకట్టడం కాని, చిట్లిపోవడం కాని జరుగుతుందని, ఇలాంటి పరిస్థితుల్లో అలాంటి సందర్భాల్లో బ్రెయిన్ బైపాస్ సర్జరీ అత్యవసరమవుతుందని తెలిపారు. మైక్రో సర్జరీల ద్వారా ఈ సమస్యను సరిచేయవచ్చన్నారు. తద్వారా రోగికి మరింత మెరుగైన చికిత్స అంది, అతను త్వరగా కోలుకునే వీలు కలుగుతుందన్నారు.

వీధి కుక్కల దాడి.. చిన్నారికి తీవ్ర గాయాలు

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 16: వీధి కుక్కల దాడిలో ఓ ఐదేండ్ల చిన్నారి తీవ్రంగా గాయపడింది. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధి పద్మశాలిపురానికి చెందిన రఫీ, హైసా దంపతుల కూతురు గులాబ్షా పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి ఆడుకునేందుకు బయటకు వచ్చింది. ఇంటి ముందు ఆడుకుంటుండగా, వీధి కుక్కల గుంపు ఒక్కసారిగా దాడి చేశాయి. చిన్నారి గట్టిగా కేసులు వేయడంతో స్థానికులు కుక్కలను తరిమికొట్టారు. తీవ్రంగా గాయపడిన గులాబ్షాను కుటుంబసభ్యులు వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించారు.